ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్/ సదాశివనగర్, ఏప్రిల్ 7: సదాశివనగర్‌లోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం 536మంది దరఖాస్తు చేసుకోగా.. 490 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశ పరీక్ష కోసం మొత్తం 528మంది దరఖాస్తు చేసుకోగా 464మంది హాజరయ్యారని, మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఎల్లారెడ్డిలో ఆరో తరగతిలో 218మంది విద్యార్థులకు గాను 188మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ సాయిబాబా తెలిపారు. ఏడో తరగతికి 80మందికి 71, 8వ తరగతికి 90మందికి 83, తొమ్మిదో తరగతికి 60మందికి 52మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది.

ఉగాది వేడుకలకు ఆలయాలు ముస్తాబు

రాజంపేట్, ఏప్రిల్ 7: మండలంలోని ఆలయాలు ఉగాది వేడుకలకు ముస్తాబవుతున్నాయి. ప్రధానంగా బస్వన్నపల్లి, ఆర్గొండ గ్రామాల్లో నిర్వహించే సంబురాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ పండుగను ఆయా గ్రామాల ప్రజలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. బస్వన్నగుట్ట వద్ద ఇరు గ్రామాలవారు ఎడ్లబండ్ల ప్రదర్శన, జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. వేడుకలను తిలకించేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి జనం పెద్దసంఖ్యలో తరలివస్తారు. ఉగాది మరుసటిరోజు జడకొప్పు కొలాటం, ఎడ్లబండ్ల ప్రదర్శన ఉంటుంది. మూడో రోజు పోలేరమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అదే రోజు రాత్రి బస్వన్నగుట్ట వద్ద అన్నదానం, భజన కార్యక్రమాలు ఉంటాయి. తెల్ల వారు జామున అగ్నిగుండాలు నిర్వహిస్తారు.

రజక సంఘం అధ్యక్షుడికి సన్మానం

రాజంపేట్, ఏప్రిల్ 7: రాజంపేట రజక సంఘం అధ్యక్షుడిగా నియమితుడైన బద్రి స్వామిని స్నేహ బంధం సిండికేట్ ప్రతినిధులు అభినందించారు. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద ఆయనను ఆదివారం ఘనంగా సన్మానించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని గూడెం శివారులో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, దేవునిపల్లి పోలీసులు కలిసి దాడి చేసి పేకాడుతున్న వారిని పట్టుకున్నారు. వారి వద్ద రూ.13,830నగదు, ఐదు బైకులు, ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సేవాలాల్ మాలధారులకు భిక్ష

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 7: మండలంలోని చిన్న దేవీసింగ్ తండాలో సేవాలాల్ మాలధారులకు ఆదివారం భిక్ష ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా భవానీ మాత, సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాలధారులు, నాయకుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూలనపడిన ట్రాక్టర్.. మురికి కూపంలా గ్రామం

- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బంది పడుతున్న పెద్ద టాక్లీ గ్రామస్తులు

డోంగ్లీ, ఏప్రిల్ 7: మండలంలోని పెద్ద టాక్లీ గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ఇండ్లలో చెత్తాచెదారం పేరుకుపోతున్నది. చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాకపోవడంతో చాలా మంది ఇంటి బయట రోడ్డుపై వేస్తున్నారు. చెత్తను తీసుకెళ్లాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలిపితే.. ట్రాక్టర్ బాగులేదని సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడంతో గ్రామం అంతా మురికి మయంగా మారుతున్నది. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వెనుక రోడ్డుపై కొందరు చెత్తను వేస్తున్నారు. మురికి కాలువలను శుభ్రం చేయడం లేదు. దీంతో ఈగలు, దోమల బెడద పెరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పట్టింపులేని అధికారులు..

పంచాయతీ సెక్రటరీ, మండల ప్రత్యేక అధికారి(ఎంపీవో) పట్టించుకోకపోవడంతోనే గ్రామం ఇలా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారి గ్రామంలో పర్యటించడం లేదని, వీధుల్లో తిరిగితేనే సమస్యలు తెలుస్తాయని ప్రజలు అంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ ట్రాక్టర్లు పనిచేయడం లేదని, దీంతో గ్రామాలన్నీ చెత్తతో నిండిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాక్టర్లను రిపేర్ చేయించాలని, గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిరోజూ తరలిస్తాం..

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ పనిచేయడం లేదు. దీంతో మూడు చక్రాల రిక్షాపై చెత్తను తరలించాం. ట్రాక్టర్‌కు పలుమార్లు రిపేర్ చేయించినా.. ఏదో ఒక సమస్య ఏర్పడుతున్నది. త్వరగా రిపేర్ చేయించి ప్రతిరోజూ చెత్తను సేకరించి కంపోస్టుషెడ్‌కు తరలిస్తాం.

- శ్రీనివాస్, జీపీ కార్యదర్శి, పెద్ద టాక్లీ

పెద్ద టాక్లీ గ్రామంలో పేరుకుపోయిన చెత్త

అంగన్‌వాడీల హామీలను అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్

కామారెడ్డి, ఏప్రిల్ 7: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకొని హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టీచర్లకు రూ. రెండు లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష, 60 ఏండ్లు దాటినవారికి వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో జారీ చేయాలని కోరారు. సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

'జలం.. జీవం.. జీవనం..' పుస్తకావిష్కరణ

కామారెడ్డి, ఏప్రిల్ 7: ప్రముఖ కవి గఫూర్ శిక్షక్ రచించిన జలం.. జీవం.. జీవనం.. అనే పాటల పుస్తకాన్ని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. కామారెడ్డిలోని నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెరవే ప్రతినిధులు మాట్లాడుతూ.. నీరు లేని భవిష్యత్తును ఊహించుకోవడం కష్టమని, మన సంస్కృతి, ఆచార వ్యవహారాల్లో నీటిని సంరక్షించుకునే అనేక పద్ధతులు ఉన్నాయని, వాటిని నేడు మనం ఆచరించడం లేదన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రతినిధులు రామచంద్రం, పీతాంబర్, గంగాప్రసాద్, సుధాకర్, చంద్రకాంత్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెరవే ప్రతినిధులు

నూతన కార్యవర్గ సభ్యులు

ఏఎస్ఆర్ ఫౌండేషన్ కార్యవర్గం ఎన్నిక

పిట్లం, ఏప్రిల్ 7: ఏఎస్ఆర్ ఫౌండేషన్ పిట్లం మండల నూతన కార్యవర్గాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని పవన్, కోశాధికారిగా చాకలి పండరి, ఉపాధ్యక్షులుగా రాకేశ్, శివ, సహాయ కార్యదర్శులుగా అజయ్, అఖిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జహంగీర్, సాయి, గోవింద్‌సింగ్, సలహాదారులుగా నారాయణ, సురేశ్, రవి, వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న చుక్కాపూర్ జడ్పీహెచ్ఎస్ 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎస్టీ హాస్టల్ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

మాచారెడ్డి, ఏప్రిల్ 7 : మండలంలోని చుక్కాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో చదివిన 1991-92 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు 32 సంవత్సరాల తర్వాత ఒక్కచోట కలుసుకున్నారు. ఇందుకు మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ప్రాంగణం వేదికైంది. ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చిన్ననాటి మిత్రులు కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వృత్తి, కుటుంబ వివరాలను ఒకరినొకరు పంచుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు భద్రయ్య, తిరుపతిరెడ్డి, కిషన్‌గౌడ్, హన్మాండ్లు, సత్యం, నర్సింహారావు, సంజీవయ్య, శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

50 ఏండ్ల తర్వాత హాస్టల్ విద్యార్థులు..

కామారెడ్డి, ఏప్రిల్ 7: జిల్లాకేంద్రంలోని షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహంలో 1970 నుంచి 1995 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వారు వసతిపొందిన హాస్టల్ ప్రాంగణంలోనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని, చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

కామారెడ్డి, ఏప్రిల్ 7: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్, నాయకులు చేపూరి నాగభూషణం, సిద్ధరాములు, రాజు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

మద్నూర్, ఏప్రిల్ 7: మండలకేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో నిర్మించిన బీరప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేకపూజలు చేసి స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బండివార్ విజయ్‌కుమార్ దంపతులు, మాజీ సర్పంచ్ దరాస్ సురేశ్, మాజీ ఎంపీటీసీ గడ్డం లక్ష్మణ్, కుర్మ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

CHANGE OF NAME

I, MOHAMMAD ABDUL MUJEEB, R/o.H.No. 1-5-118/9/1, Zirayath nagar, Armoor, (D) Nzb Changed my name as ABDUL MUJEEB S/o. ABDUL MAQBUL

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకృతివనం.. లోపించిన పచ్చదనం

పిట్లం గ్రామపంచాయతీ పరిధిలోని ముకుందర్‌రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో పచ్చదనం కరువైంది. కాలనీవాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని పంచే చెట్లు లేకపోవడంతో అటువైపు వెళ్లడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. ప్రకృతివనంపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, మొక్కలను కాపాడలేకపోయారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రకృతివనం ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. -పిట్లం, ఏప్రిల్ 7

ఆదమరిస్తే అంతే సంగతి!

డోంగ్లీ మండలంలోని లింబూర్ - చిన్న టాక్లీ గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన వంతెన పనులు కొన్ని నెలల క్రితం పూర్తయ్యాయి. మద్నూర్ నుంచి బోధన్, నిజామాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కోట్ల రూపాయలతో నిర్మించిన వంతెనకు పక్కన సరిగా మట్టి వేయలేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వాహనదారుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా మట్టి వేయించాలని ప్రజలు కోరుతున్నారు. -డోంగ్లీ, ఏప్రిల్ 7

మొర్రిపండ్లు కోస్తూ..

చెట్టు పైనుంచి జారిపడి యువతి మృతి


భూలి (ఫైల్)

రాజంపేట్, ఏప్రిల్ 7: చెట్టు పైనుంచి జారిపడి యువతి మృతిచెందిన ఘటన మండలంలోని శేర్‌శంకర్ తండా పంచాయతీ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సంపత్ తెలిపిన వివరాల ప్రకారం మూడుమామిండ్ల తండాకు చెందిన ముద్రిచ్చ భూలి (22) తల్లి లక్ష్మితోకలిసి ఆదివారం ఉదయం మొర్రి పండ్ల కోసం పెద్దమ్మ గుట్టకు వెళ్లింది. భూలి చెట్టుపైకెక్కి మొర్రి పండ్లు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడింది. వెంటనే ఆమెను కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నవీన్ (ఫైల్)

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 7: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ వద్ద శనివారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసంపల్లి గ్రామానికి చెందిన గొర్రె నవీన్(34) శనివారం రాత్రి బైక్‌పై పెద్దారెడ్డి గ్రామానికి బయల్దేరాడు. ఆత్మాకూర్ పీడబ్ల్యూడీ రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సువర్ణ తన భర్త మృతికి హార్వెస్టర్‌పై అనుమానం ఉన్నదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి, ఏప్రిల్ 7: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల రోడ్‌లో నివాసం ఉండే చింతల రాజు (36) మిఠాయిలు తయారు చేసి జాతర్లలో విక్రయిస్తూ జీవించేవాడు. ఈయన మద్యానికి బానిస కావడంతో భార్య రేణుక పిల్లలతో కలిసి ఈ నెల 3వ తేదీన తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ తెలిపారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మైనింగ్ గుంతలో పడి మూడు గేదెలు మృతి

గాంధారి, ఏప్రిల్ 7: మైనింగ్ కోసం తవ్విన గుంతలో పడి మూడు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలోని చద్మల్ తండాలో చోటుచేసుకున్నది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరల్‌తండాకు చెందిన బర్దావల్ బర్త్యా, బర్దావల్ చందన్‌సింగ్, బస్సీ ప్రకాశ్‌కు చెందిన ఐదు గేదెలు శనివారం రాత్రి నీరు తాగడం కోసం చద్మల్ తండా సమీపంలో చెరువుకు వెళ్లాయి. చెరువు సమీపంలో తవ్విన(మొరం కోసం) గుంతలో పడి మూడు బర్రెలు ఘటనా స్థలంలోనే మృతిచెందాయి. మరో రెంటింటి పరిస్థితి విషమంగా ఉన్నదని తండావాసులు తెలిపారు. పాలు ఇచ్చే గేదెలు మరణించడంతో తాము నష్టపోయామని, రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. కాగా.. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టడంతోనే గేదెలు మృతిచెందాయని చద్మల్ తండావాసులు ఆరోపించారు. మట్టిని తరలించేందుకు పదుల సంఖ్యలో వాహనాలు వస్తున్నాయని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. అధికారులు స్పందించి మైనింగ్ పనులు చేపడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని చద్మల్, నేరల్ తండాల ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న లంబాడి స్వామి యువసేన సభ్యులు

భిక్కనూరు, ఏప్రిల్ 7: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మిద్దె రిక్షా సిద్ధయ్య ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి లంబాడి స్వామి యువసేన సభ్యులు అండగా నిలిచారు. మాజీ సర్పంచ్ తుడం పద్మ, స్వామి ఆధ్వర్యంలో ఆదివారం రూ. 3వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిద్దె ఇస్రాయెల్, బుచ్చయ్య, గంగయ్య, భూషణం, సామేల్, సాయిలు, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

శిబిరానికి హాజరైన గ్రామస్తులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 7: మున్సిపల్ పరిధిలోని గండి మాసానిపేట్ గ్రామంలో ఆదివారం ఎల్లారెడ్డి జీవదాన్ దవాఖాన ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని బస్తీ దవాఖాన వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు డాక్టర్ లిల్లీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ముస్త్యాల సుజాత, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 7: నిజాంసాగర్‌లోని మసీదులో ఆదివారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. అల్లా దయతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. విందులో ఆయనతోపాటు పలువురు ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.